www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024   8 పేజీలు



వైఎస్ఆర్



అన్నమయ్య

చేనేత కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లి

అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు జి.మల్లికార్జున కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మదనపల్లికి చెందిన జి.మల్లికార్జున సోమవారం ఆత్మహత్య చేసుకున్నారని, వారు చేనేత మగ్గంపై ఆధారపడే వారని తెలిపారు. అప్పుల బాధతో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గంనేస్తూ కుటుంబాన్ని పోషించుకోలేక, మగ్గం నిర్వహణకు, ముగ్గురు కుమార్తెల వివాహాలకు అప్పులు చేశాడని పేర్కొన్నారు. చేనేత కార్మికలను ప్రభుత్వ నిర్లక్ష్యం చేసిన ఫలితంగా చేనేత కార్మికులు మరింత అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు తీరే మార్గం కనిపించకే మల్లికార్జున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. ఆత్మహత్యలు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు.

తగ్గిన దిగుబడులు...

పాడి రైతు దిగాలు

ధరలు పెంచాలని, ప్రభుత్వం కొనుగోలు చేయాలని పాడి రైతుల వినతి



పాలు సేకరిస్తున్న ప్రయివేట్ వ్యాపారులు



రైతులకు ఉపాధినిస్తున్న పాడి పశువులు

ప్రజాశక్తి-చాపాడు

వ్యవసాయం తర్వాత జిల్లా ప్రజల ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమ. రైతులు, పేద, మధ్యతరగతి ప్రజలు పాడి ద్వారా జీవనం సాగిస్తున్నారు. పాలను సేకరిస్తూ వాటిని పట్టణాల్లో అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారు. పల్లెల నుంచి సేకరించిన పాలను పట్టణాల్లో ఇళ్లకు, హోటళ్లకు సరఫరా చేస్తూంటారు. పాడి పరిశ్రమను నమ్ముకుని వేలాది కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ప్రభుత్వం ప్రతి గ్రామంలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి పాలను సేకరించేందుకు కసరత్తు చేసి అమలు చేయలేక విఫలమైంది. ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పాడి పరిశ్రమకు సంబంధించిన వివరాలను సేకరించి కేంద్రాలను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టి పూర్తి చేయడంలో విఫలమైంది. ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొని పాల సేకరణ భవనాలు నిర్మాణానికి ఏర్పాటు చేసి పూర్తి చేయలేదు. వీటి నిర్వహణలో జాప్యం జరుగుతోంది. దీంతో పాడి పోషకులు, ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. మహిళా సంఘాల ద్వారా పాలసేకరణ చేపట్టేందుకు గతంలో కార్యాచరణ రూపొందించి విషయం తెలిసిందే. ప్రతి ఆర్‌బికె సమీపంలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలను నిర్మించే ఏర్పాట్లు ముమ్మరం చేసి వదిలేశారు. జిల్లాలో 633 రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పరిధిలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుండి పాలను సేకరించాలని 2లో

తొట్టిగారిపల్లె పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ 2లో

వామ్మో... ముక్క ముట్టలేం..! 6లో

చిన్న పిల్లలతో పనులు చేయిస్తే చట్టరీత్యా నేరం 8లో

పకడ్బందీగా ఇవిఎంల పంపిణీ ప్రక్రియ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక బద్ధంగా ఇవిఎంల పంపిణీ, రిసెప్షన్ ప్రక్రియలను నిర్వహించాలని కలెక్టర్, అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ కోడూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కోడూరు మండలం అనంతరాజుపేటలోని ఉద్యానవన యూనివర్సిటీలో నియోజకవర్గానికి సంబంధించి తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూములను ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఎన్ని స్ట్రాంగ్ రూములు ఉన్నాయి, పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లో పిఎస్ నెంబర్లు వేశారా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు స్ట్రాంగ్ రూములో అన్ని ఏర్పాటు పూర్తి చేశారా లేదా తదితర అంశాలపై కోడూరు రిటర్నింగ్ అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గానికి సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీకి విడివిడిగా పిఎస్ వారీగా మూడు స్ట్రాంగ్ రూములలో ఇవిఎంలను భద్రపరచడం జరుగుతుందని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి మరొక గదిని కూడా సిద్ధం చేసుకుంటున్నామని చెప్పారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి లీలారాణి జిల్లా ఎన్నికల అధికారికి వివరించారు. అనంతరం వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ విధులకు వచ్చిన అధికారులు సిబ్బంది వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేస్తారు, పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన బస్సులను ఏ విధంగా పార్కింగ్ చేస్తారు, బస్సులు లోపలికి వచ్చేటప్పుడు తిరిగి వెళ్లేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖతో తగ్గిన విధంగా సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం రూట్ మ్యాపులు, వాహనాల పార్కింగ్ పక్కాగా రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పి బి.కృష్ణారావు పోలీస్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూముకు తీసుకువచ్చిన ఇవిఎంలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా స్వీకరించి, తిరిగి వాటిని తగిన భద్రతతో జిల్లా కేంద్రం రాయచోటి నందలి పర్మనెంట్ స్ట్రాంగ్ రూమునకు తరలించాలని కలెక్టర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్, సెప్షన్ ప్రక్రియలను విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు వారు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్‌డి మోహన్ కుమార్, డిఎస్‌పి చైతన్య, రైల్వేకోడూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లీలా రాణి, సంబంధిత తహశీల్దారులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంసిసికి లోబడే ప్రచార అనుమతులు

వైఎస్ఆర్ జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప

ఎన్నికల ప్రచార కార్యకలాపాల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడే ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జెసి గణేష్ కుమార్, డిఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో వి.విజయ్ రామరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోదలిచే రాజకీయ పార్టీల ప్రతిని ధులు తప్పనిసరిగా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధ నలను పాటిస్తూ సంబందిత రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడతామన్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రత్యక్ష ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా విచారించి చర్యలు చేపడతామని తెలిపారు. అనుమతి లేకుండా ప్రచార కార్యకలా పాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపె యిన్, రోడ్ షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టూ డోర్ ప్రచా రానికి కూడా పర్మిషన్ తప్పక తీసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అభ్యర్థులు వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్స్ లకు సంబంధించిన రేటింగ్ కార్డు ఇస్తామన్నారు. పార్టీ అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాల్సి ఉంటుం దన్నారు. యంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, ఎక్స్పెండేచర్డెచర్ మానిట రింగ్ తదితర టీములు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తు న్నాయన్నారు. షాడో అబ్జర్వేషన్ కూడా 24/7 నిరంతర నిఘా నిర్వహిస్తామన్నారు. సీజర్ మేనే జ్మెంట్ సిస్టమ్ అంతా పారదర్శకంగా జరుగుతుం దన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఫోర్స్ భద్రతతో పాటు వెబ్ క్యాస్టింగ్, సాధారణ పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులతో పాటు ఎన్‌సిసి, స్కౌట్ గైడ్ ల సేవలను వినియోగిస్తామని తెలిపారు. ప్రతి పోలింగ్ బూతు వద్ద స్త్రీ, పురుషులకు వేర్వేరు క్యూలైన్లు అలాగే సీనియర్ సిటీజన్లు, గర్భిణులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి.. ఈ నెల 17వ తేదీ లోపు అన్ని రకాల ఫారాలకు సంబంధించి అభ్యర్థనలు పరిశీలించి పూర్తి చేస్తామన్నారు. అభ్యర్థనలు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల విధులకు అన్ని 2లో

తగ్గిన దిగుబడులు...

(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ప్రయివేట్ పాల కేంద్రాల నుంచి రైతులకు ఎలాంటి లబ్ధి అందడం లేదు. పాడి రైతులకు ఖర్చులు పెరగడంతో ప్రభుత్వం ద్వారా పల్లెల్లో పాల ఉత్పత్తి ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోనే పాల ఉత్పత్తిలో పేరుగాంచిన చాపాడు మండలంలో ప్రస్తుతం పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గాంధీ నగరంలో పశువుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. గతంలో ఈ గ్రామం అధిక పాల దిగుబడి సాధించడంతో అనేకమార్లు అవార్డు అందుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం పాల సేకరణ కేంద్రాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పాల దిగుబడి తగ్గింది. దిగుబడి తగ్గినందున పాల ధరలు పెంచాలని రైతులు కోరుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో పదికి పైగా ప్రయివేటు పాల కేంద్రాలు కొనసాగుతుంటే ప్రభుత్వ కేంద్రాలు ఒకటి కూడా లేదు. గత ప్రభుత్వ ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా జిల్లాలో 17 ప్రాంతాల్లో పాల సేకరణ కేంద్రాలు కొద్దిరోజులు నడిపారు. ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు ప్రయివేట్ వాటి ముందు నిలువలేక పోయాయి. ప్రయివేట్ పాల సేకరణ కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ప్రోత్సాహకం ఉండడంలేదు. గతంలో పాడి పశువులను కొనుగోలు నిర్వహణకు ఆర్థిక సహాయం కూడా ప్రభుత్వం అందించేది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి పరిశ్రమకు ఎలాంటి ఆదరణ లేదు. పాడి రైతుల కంటే పాల సేకరణ చేసే వారికే లాభాలు అధికంగా ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో రోజుకు లక్ష లీటర్ల వరకు పాల సేకరణ జరుగుతోంది. పశువుల దాణ, గడ్డి రేట్లు విపరీతంగా పెరగడంతో పశువుల పోషణ భారమైంది. ఈ నేపథ్యంలో పాడి రైతుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. 50 కిలోల పశువుల దాణా రూ.1500, ఎకరా వరిగడ్డి రూ.పదివేల వరకు అవుతోంది. ఖర్చు భరించలేక పాడి రైతులు పశువుల పెంపకం పట్ల విముఖత చూపుతున్నారు. ప్రయివేట్ వ్యాపారులు పాలు వెన్న శాతం ప్రకారం ధరలు నిర్ణయిస్తున్నారు. వారు మాత్రం మార్కెట్లో లీటర్ల ప్రకారం ధర నిర్ణయించి కల్తీ వ్యాపారంతో కాసులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. 1987లోనే మండల పరిధిలో ప్రభుత్వం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి వేల లీటర్లు మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాల కేంద్రాలకు తరలించారు. తర్వాత కాలంలో ప్రయివేట్ పాల కేంద్రాల ధాటికి ప్రభుత్వ కేంద్రాలు మూత పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం నూతన పాల సేకరణ విధానం తీసుకొచ్చి మళ్లీ పాత పద్ధతులు తీసుకురావాలనే ఆలోచనలో ఉంది. జిల్లాలో సుమారు ఐదు లక్షల ఆవులు, పశువులు ఉన్నాయి. అధికారికంగా ప్రతి రోజూ ఆరు లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. ఇప్పటికీ జిల్లాలో పాల ఉత్పత్తులు అత్యధికంగా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఉన్నవి. ప్రయివేట్ కేంద్రాల నుంచి జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పాలతోపాటు మజ్జిగ ఇతర ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల్లో పాలను కొనుగోలు ఎప్పుడు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వెన్న శాతం 10 అయితే రూ.70 లీటర్‌కు చెల్లిస్తున్నారు. వెన్న శాతం తగ్గితే రూ.40 నుంచి రూ.50మాత్రమే రైతులకు అందుతోంది. ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పాలసేకరణ కొనసాగితే కొంత సంపాదించుకోవచ్చునని పాడి రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఎంసిసికి లోబడే...

(మొదటి పేజీ తరువాయి) కేటగిరీల వారీగా సిబ్బందికి విధులను కేటాయిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, హెచ్ఆర్ పాలసీ నియామక ఉద్యోగులకు మాత్రమే విధులను కేటాయిస్తామని తెలిపారు. ఇవిఎంల పరంగా లెక్క ప్రకారం జిల్లాకు సరిపడా మేర సిద్ధంగా ఉన్నాయన్నారు. 12వ తేదీన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే.. ఈ నెల 13, 14వ తేదీల్లో పివో, ఏపీవో లకు మొదటి విడతలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మే 5వ తేదీన ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.హరిప్రసాద్(టిడిపి), కానుగ దానం (బిఎస్‌పి), జి.లక్ష్మణ్ రావు (బిజెపి), బి.పాల్ సుధాకర్ (కాంగ్రెస్), బి.మల్లికార్జున (వైసిపి), డాక్టర్ బి.శ్రీనివాసులు, ఎం.తిరుమల్‌రెడ్డి(ఆప్) మనోహర్ (సిపిఎం), సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టిగారిపల్లె పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ


పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగు ప్రధానమంత్రి మాతృత్వ అభయాన్ సురక్షిత ప్రోగ్రాంను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణులు అందరికీ సరైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించి, ముఖ్యంగా కష్టతరమైన గర్భిణులను గుర్తించి 102, 108 వాహనం ఉపయోగించుకొని, సరైన సమయంలో సరైన చికిత్సను అందించవలసిందిగా పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్స్‌కు ఆదేశించారు. వేసవిలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నందువలన వడదెబ్బ పైన ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ ప్రాముఖ్యతను తెలియజేసి ఒఆర్ఎస్ ప్యాకెట్లు విలేజ్ హెల్త్ క్లినిక్, ఆరోగ్య కార్యకర్తలు దగ్గర అందుబాటులో ఉంచాలనా ఆదేశించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం గాంధీ నగర్‌లో జరుగు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సరైన సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వి.మల్లేష్ బద్వేల్ పట్టణ ఆరోగ్య కేంద్రం కోటవీధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్, సౌమ్య, జిల్లా ఎపిడిమాలజిస్ట్ ఖజా వుద్దీన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకట్ రెడ్డి, ఎంపీహెచ్వో కె.వి.ఎస్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రావతి, విలేజ్ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తా : మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరాన్ని అధ్వాన్న పరిస్థితిలోకి నెట్టేసింది వైసిపి నేనని, ప్రజలకు నీళ్లు ఇవ్వలేని స్థితికి స్థానిక పాలకులు చేరుకున్నారని కడప అసెంబ్లీ టిడిపి అభ్యర్థి మాధవి విమర్శించారు. 47 డివిజన్లోని రామలింగ చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎన్నికల ప్రచారాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తతంగా నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా చేపట్టే కార్యక్రమాల గురించి ఆమె డివిజన్ ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలపై అర్ధరాత్రి తనకు ఫోన్ చేసినా స్పందిస్తానని చెప్పారు. ఒక్కసారి తెలుగుదేశం పార్టీకి అధికారం ఇస్తే, పరిశ్రమలు తీసుకువచ్చి మహిళలకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. సమస్యలు లేని నగరంగా తీర్చిద్దడమే తన ముఖ్య లక్ష్యం అన్నారు. అవగాహనరాహిత్యంతో జగన్ పాలన కొనసాగించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే, ఆ పార్టీ నేతలు ఐదేళ్ళ దోచుకోవడం, దాచుకోవడం తోనే పుణ్యకాలం ముగిసిపోయిందని అన్నారు. ఎన్నికల సమయంలో వారికి ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. నీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు వారికి పట్టవా అన్నారు. రోడ్లు అధ్వాన్నంగా మారిన, మురుగు కాలువలు లేకున్నా పట్టించుకోరని ఆమె మండిపడ్డారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాధవి

కడపలో భూ కబ్జాలకు అంతే లేకుండా పోయిందని, ప్రైవేటు వ్యక్తుల స్థలాలతోపాటు ప్రభుత్వ భూములు వారి సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. వారు చెప్పినట్లు నడుచుకున్న అధికారులకు తిప్పలు తప్పవని చెప్పారు. అధికారంలోకి వచ్చే రాగానే ప్రజావేదికను కూల్చారని, అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను కూలదోసిన వైసిపికి ఓట్లేస్తారా అని ప్రశ్నించారు. టిడిపికి అధికారం కట్టబెట్టే అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నబీకోట శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, మస్తాన్‌బాష, ప్రవీణ్, రెడ్డి బాష, సుభాన్‌బాష, చిన్న హుస్సేన్, ఇబ్రహీం హుస్సేన్, సిద్దాం హుస్సేన్, సుభాన్, రాజశేఖర్, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు


సీతారామలక్ష్మణ దేవాలయం

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని శివాలపల్లె దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి హనుమ సమేత సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురు వారం నుండి శనివారం వరకు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు, బుధవారం కమిటీ నిర్వాహకులు చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్య వాచనం, ఎత్విశకరణం, కంకణ ధారణం, అఖండ దీపస్థాపనం, కలశ పూజలు, సాయంత్రం నాలుగు గంటల నుండి జలాధివాసం, దీక్ష హోమం, నవగ్రహ జపాలు, మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగం పురోహితులచే నిర్వహిం చబడతాయని తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ప్రాతః పూజ, యంత్రములకు రుద్రాభిషే కములు, 9 గంటల నుండి గణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం, శ్రీ సూక్తం హోమం, నిర్వహించబ డతా యన్నారు. 11 గంటలకు ప్రతిష్ఠా విగ్రహలకు మహాస్నాపన కార్యక్రమం, మధ్యాహ్నం మూడు గంటల నుండి విగ్రహా గ్రామోత్సవ కార్యక్రమం జరుగును, సాయంత్రం 6 గంటలకు ధాన్యాధి వాసం, పుష్పాధివాసం, షయాధి వాసం, జరుపబడునని తదుపరి మంగళ హారతి తీర్థ ప్రసాదాలు ఉంటా యని తెలిపారు, 13వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు గర్త పూజ, యంత్ర ప్రతిష్ట, తదుపరి 8 గంటల పది నిమిషాల నుండి శిఖర కలశ ప్రతిష్ట, శ్రీ సీతారామ లక్ష్మణ, హనుమ విగ్రహ ప్రతిష్ట జరుపబ డునని 10 గంటలకు ప్రాణ ప్రతిష్ట సర్వదర్శనం పూర్ణాహుతి, 10 గంటలు 11 గంటల నుండి శ్రీ సీతారామ కళ్యాణము జరుప బడతాయని, మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నదాన కార్య క్రమం నిర్వహిం చబడతాయని గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సీతారామ లక్ష్మణ కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

హోంగార్డులను బదిలీ చేయండి

- టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయను ప్రైవేట్ సెక్యూరిటీగా ఉన్న వారిని, వారి దగ్గర పనిచేసిన వారందరినీ జిల్లాలో హోంగార్డులుగా నియమించారని పట్టభద్రుల ఎంఎల్‌సి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. అధికారులను తప్పుదారిపట్టించే అవకాశం, గోప్యత విషయాలను వైసిపి నాయకులకు చేరవేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2019 తరువాత నియమించబడ్డ హోం గార్డులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఆ లేఖలో కోరారు.

ఆరోగ్యంపై డాక్టర్ల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి - కడప

మన ఆరోగ్యం మన చేతులలో ఎండాకాలంలో ప్రజలు డాక్టర్ యొక్క సూచనలు సలహాలు పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని పాల కొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండా సుబ్బయ్య అన్నారు. బుధవారం వేసవిలో మన ఆరోగ్యం కాపాడుకోవాల్సిన సూచనలు అనే పోస్టర్లను ఎంఎం హాస్పిటల్ ప్రముఖ కంటి వైద్యులు. డాక్టర్ ఆసిఫ్ చేతుల మీదగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దలు సీనియర్ సిటిజన్లు ఉదయం 11 గంటల తర్వాత బయటకు రాకుండా ఉండాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తమ వెంట గొడుగు, తాగునీటి బాటిల్ వెంట తీసుకొని వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో నారాయణ, సైఫ్, స్టాఫ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులుగా పెంచలయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులుగా వాండ్రాసి పెంచలయ్యను ఎన్నుకున్నట్లు సమాజ సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి చింతాబాబు పేర్కొన్నారు. బుధవారం తిరుపతిలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించినట్లు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యార్థుల, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.



ఇఫ్తార్ విందులో విద్యార్థులు

'నారాయణ'లో ముందస్తు రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని బోస్‌నగర్ గల నారాయణ పాఠశాలలో బుధవారం ముందస్తుగా రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇఫ్తార్ నమాజ్ చదివి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పు కున్నారు. పాఠశాల ఎజిఎం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రిన్సిపల్ ఖాదర్‌వలి మాట్లాడుమా ఇటు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఇతర మతాలు పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సంపత్, బేయ షాం, వైస్‌ప్రిన్సిపల్ సుగుణవేణి, నందిని, యువరాజు, నరసింహులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని ఆడపూరు గ్రామంలో వెలసిన శ్రీ మంచాలమ్మ తల్లి గ్రామోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామోత్సవానికి బయలుదేరిన మంచాలమ్మ బుధ వారం మధ్యాహ్నానికి ఆలయానికి చేరుకుంది. ఆడపూరు, రాచపల్లి, కొండాయపల్లె, హరిజనవాడ, మర్రి పల్లె గ్రామాలలో గ్రామోత్సవం కొనసాగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం ఆడపూరు గ్రామానికి చెందిన వెంకటమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం చేయడం గొప్ప భాగ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి యేటా ఇలాగే అన్నదాన దానం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆల య ధర్మకర్త ఇంజం రామచంద్ర నాయుడు, సర్పంచ్ నందలూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య నాయుడు, గ్రావిటీ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, నందలూరు శ్రీనివాసుల రెడ్డి, మేకల బాబు, బుజ్జయ్య నాయుడు, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో అంధకారం

-పట్టని విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన హార్సిలీహిల్స్ అంధకారంగా మారింది. ముఖ్యంగా ఏనుగు మల్లమ్మగుడి పరిసర ప్రాంతాలలో సోమవారం నుండి విద్యుత్ సరఫరా స్తంభించింది.రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యుత్ అంతరాయంతో కారు మబ్బుల్లో పసిపిల్లల రోదనలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోకుండా విద్యుత్ శాఖ సిబ్బంది,అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రయివేట్ రెస్టారెంట్లు, హోటళ్లకు పది నిమిషాలపాటు విద్యుత్ సరఫరా ఆగిపోతే క్షణాల్లో వచ్చే అధికారులు సామాన్య ప్రజలంటే ఇంతటి నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్‌కుఅంతరాయం కలుగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నల్లారి ద్వారకనాథరెడ్డిని పీలేరు బార్ అసోసియేషన్ గౌరవ సత్కారాన్ని అందించింది. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ హోదాలో మొదటిసారి పీలేరుకు వచ్చిన ఆయనను స్థానిక కోర్టు ఆవరణంలో పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బిసి పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన ఆయన్ను ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 71 ఏళ్ల బార్ కౌన్సిల్ చరిత్రలో మొదటిసారి జిల్లా కోర్టు న్యాయవాదికి బార్ కౌన్సిల్ చైర్మన్ పదవి దక్కిందని, తన ఈ హోదాకు న్యాయవాదులందరి సహాయ, సహకారాలే కారణమని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక బార్ అసోసియే షన్ అందించిన వినతులను ఆయన స్వీకరించారు. ప్రధానంగా పీలేరు కోర్టు భవనాల నిర్మాణాలు, ఖాళీగా ఉన్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి భర్తీ గురించి న్యాయవాదులు పేర్కొన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని రాష్ట్ర చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకువెళ్లి త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు అందాల్సిన డెత్ కాంపెన్సేషన్ రూ.4లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచారని, మెడిక్లెయిమ్ రూ.30 నుంచి రూ.50 వేలకు పెంచారని తెలిపారు. పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్స్ త్వరగా అందేటట్లు సంబంధిత అధికారులతో కలిసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బిసి పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, కార్యనిర్వాహక సభ్యులు తెనాలి రామ సుబ్రహ్మణ్యం, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎండి రఫీఅన్సారీ, ఇతర సభ్యులు జి.శివకుమార్‌రెడ్డి, వి.చిన్న రెడ్డెప్ప, జగన్మోహన్‌రెడ్డి, సుధా కర్‌రెడ్డి, భవాని శంకర, జి.ఈశ్వర్‌రెడ్డి, రాజేంద్రబాబు, దొర స్వామి నాయుడు, నరసింహారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

ఆంగ్ల భాషలో ప్రతిభ వెల్లడికి టోఫెల్ పరీక్ష

- మడితాటి నరసింహారెడ్డి



టోఫెల్ పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఇంగ్లీష్‌లో నైపుణ్యాలను పెంపొందించేందుకు, వారి ప్రతిభను వెలికి తీసేందుకు టోఫెల్ పరీక్ష తోడ్పడుతుందని సంబేపల్లి మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్ కుమార్ ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం ఉదయం పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులకు వినడం, చదవడం, రాయడం నైపుణ్యాలపై అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ వారిచే (ఇటిఎస్) నిర్వహించే టోఫెల్ ప్రాథమిక స్థాయి పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్ష నిర్వహణకు పాఠశాలలోని ఐవిపి ప్యానల్‌ను, ఎన్‌సిఇఆర్‌టి వారు జారీ చేసిన ప్రింటెడ్ ప్రశ్నాపత్రాలను ఉపయోగించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే తీరును, యాసను అర్థం చేసుకొని తిరిగి జవాబు ఇచ్చేందుకు, విద్యార్థులు ఆంగ్లంలో చక్కగా మాట్లాడేలా తర్ఫీదు ఇవ్వడానికి టోఫెల్ శిక్షణను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థులకు అత్యుత్తమ ఆంగ్ల నైపుణ్యాలు, సామర్థ్యాలు అలవడేలా తగిన శిక్షణ ఇచ్చి ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షల్లో రాణించేలా చిన్న నాటి నుంచే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టోఫెల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి వారానికి మూడుసార్లు గంటసేపు స్మార్ట్ టివిల ద్వారా, ఐఎఫ్‌పి ప్యానల్స్ ద్వారా ఆడియో కంటెంట్‌ను పాఠశాలలో వినిపించి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం 3,4,5 తరగతులకు నిర్వహించిన టోఫెల్ ప్రాథమిక స్థాయి పరీక్షతోపాటు ఈనెల 12న 6,7,8,9 తరగతుల విద్యార్థులకు వినడం, చదవడం, రాయడంతో పాటు మాట్లాడడం పై జూనియర్ స్థాయి పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్ ప్రదానం చేయడం జరుగ ుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టోఫెల్ ప్రవేశపెట్టడం వలన ప్రపంచంలోని ఏ ప్రాంతం వారితో నైనా మన విద్యార్థులు సంభాషించేందుకు తద్వారా అనుసంధానం పొందేందుకు అవకాశం ఏర్పడు తుందన్నారు. దీనివలన వృత్తిపరంగా, విద్యా పరంగా ఎవి విద్యార్థులకు మంచి అవకాశాలు ఏర్పడతా య న్నారు. కార్యక్రమంలో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు దేవ ప్రసాద్‌రెడ్డి, విజయభాస్కర్, జోసెఫ్, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

సింగన్నగారిపల్లి జాతరలో 'తుర్లు'

ప్రజాశక్తి-మదనపల్లి

తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం సింగన్నగారిపల్లెలో జరుగుతున్న జాతరలో రాజంపేట పార్లమెంటు ఇండిపెండెంట్ అభ్యర్థి తుర్లు ఆనంద్ యాదవ్ పాల్గొని స్వతంత్ర అభ్యర్థిగా తనను ఆదరించాలని ప్రజలను కోరారు. సందర్భంగా ఆయన జాతరలో తన స్నేహితులు, శ్రేయోభిలాషులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగలు, జాతరలు మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతీకలని అఅన్నరు. కుల మతాలకతీతంగా బంధు వర్గం, స్నేహితులు కలుసుకొని ఒకరినొకరు అర్థం చేసుకొనే మహత్తర ఘట్టమని అన్నారు. కార్యక్రమంలో పి.జయకుమార్ నాయుడు, హరి, రమేష్‌యాదవ్, నర్సింహులు, మధు యాదవ్ ప్రజలు పాల్గొన్నారు.



జాతరలో తుర్లు ఆనంద్‌యాదవ్

ఉపాధి కూలీలకు ఒఆర్ఎస్ పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న దినసరి కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో వేసవి కాలంలో తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు డీహైడ్రేషన్‌తో అనారోగ్యం బారిన పడకుండా ఒఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లను క్షేత్ర సహాయకుల ద్వారా పంపిణీ చేశా మన్నారు. మంచి నీటి సౌకర్యం,అవసరమైన చోట్ల సేమియానా ఏర్పాట్లు, చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఒఆర్ఎస్‌ను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ



రాజీనామా పత్రాలను చూపుతున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం అంగళ్ళ గ్రామంలోని 28 మంది గ్రామ వాలంటీర్ల బుధవారం మూకుమ్మడిగా రాజీనామా పత్రాన్ని ఎంపిడిఒ హరినారాయణకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో వాలంటీర్ల తలదూర్చావద్దని ఇసి హెచ్చరికలు జారీ చేసిన నేపధ్యంలో పలువురు రాజీనామా చేసి వైసిపి అభ్యర్థులు ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కష్టపడి పనిచేసే మళ్లీ వైసిపి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చేస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేయడానికి ముందు ఉంటామని వాలంటీర్లు పేర్కొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

గర్భిణులకు వైద్య పరీక్షలు


ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోట పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ఎం.వి. కిషోర్‌కుమార్ రెడ్డి.పి. జవహర్‌బాబు ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్య ఉపకేంద్రములవారీగా 108 వాహనం ద్వారా గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకవచ్చి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారికి బిపి, షుగర్ హెచ్ఐవి, హిమ గ్లోబిన్, సిబిపి, బిటిబిటి బ్లడ్ గ్రూపు, ఆర్‌బిఎస్, యూరిన్ షుగర్ వంటి పరీక్షలు చేశామని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి కాన్పుకు కష్టతరమైన గర్భిణులను ఉన్నత స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపినట్లు పేర్కొన్నారు. 20 మంది గర్భిణులు వైద్య పరీక్షలు కోసం రాగా వారిలో ఐదుగురిని ఉన్న తాసుపత్రికి రెఫర్ చేసినట్లు చెప్పారు. రక్తహీనత తక్కువ ఉన్న వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు వేసినట్లు తెలిపారు. ఎంవి హెచ్ఇఒ జి.జయరామయ్య, స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ, హెల్త్ సూపర్వైజర్ ఎం. వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్‌లు రక్త పరీక్షలు నిర్వహించారు. ఫార్మసిస్ట్ షేక్ షరీఫ్ బాషా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సమక్షంలో మండలంలో భారీగా టిడిపిలోకి చేరారు. మండలంలోని పారపట్ల పంచాయతీలో వై.వెంకటరమణారెడ్డి, దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో దాదాపు వంద మంది టిడిపిలో చేరారు. వీరందరికీ కిషోర్‌కుమార్‌రెడ్డి టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. వైసిపి నాయకుల అరాచక పాలనను సాగనంపడానికి ప్రజలు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి, యోగేష్, మణికంఠ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుగవాసి, చమర్తి

ప్రచారం ప్రారంభించిన 'సుగవాసి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అసెంబ్లీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బుధవారం ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈడిగ పాలెం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ రాజంపేటలో వైద్య కళాశాల తీసుకువస్తానని, అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం చేస్తామని, గతంలో ఆగుతున్న రైళ్లను తిరిగి ఆగేటట్లు చూస్తామని హామీ నిచ్చారు. ట్రాఫిక్ సమస్యలను నియంత్రించి రోడ్లు వెడల్పు చేస్తామని, పట్టణంలో డ్రైయినేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో బత్యాల చెంగల్రాయుడు

రాజంపేటను జిల్లా చేస్తాం :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాయచోటికి చెందిన వారిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజంపేటకు జిల్లా తెచ్చుకోలేమని, తనను ఆదరిస్తే రాజంపేటకు జిల్లాను తీసుకొస్తానని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి రాజంపేట లోనే నివాసం ఉంటూ జిల్లా సాధన దిశగా దూసుకు వెళ్తున్న తనను ఆదరించి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపిస్తే చంద్రబాబు నాయుడుపై ఒత్తిడి చేసి రాజంపేటకు జిల్లాను తీసుకొస్తానని అన్నారు. బుధవారం పట్టణంలోని రాంనగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికి బత్యాల కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం రాంనగర్‌లో తెలుగుదేశం రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి, వార్డు అధ్యక్షులు రేవూరి నరసింహ ఆధ్వ ర్యంలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొ ంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని ప్రణాళిక బద్ధంగా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ ఇప్పటికే రాజంపేట నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్ళాలంటే రాయిచోటికి వెళ్ళాల్సి వస్తుందని, మరలా రాయచోటి వాసిని ఎమ్మెల్యే చేస్తే ఎన్నికల తర్వాత కూడా ఎమ్మెల్యే ని కలవాలంటే రాయిచోటికే వెళ్ళాల్సి వస్తుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాజంపేటకు జిల్లా కేంద్రం, వైద్య కళాశాల విషయంలో తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు.కార్య క్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, బత్యాల అభి మానులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతులు బాణాలు

ములకలచెరువు: ములకలచెరువు మండలం, పాతములకల చెరువు గ్రామం ఎస్‌ఐఇ కాలనీలో ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామ దేవతలకు గ్రామస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. డప్పుల వాయిద్యాల మధ్య మహిళలు జ్యోతులు బాణాలు మోసారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ రాత్రి జ్యోతులు బోనాలు మోసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. చౌడ సముద్రం గ్రామంలో కూడా గ్రామ దేవతకు జ్యోతులు బోనాలు మోసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- ఎండలకు సొమ్మసిల్లుతున్న కూలీలు
- ఇంటికే పరిమితమైన వృద్ధులు, చిన్నారులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ప్రజాశక్తి-పుల్లంపేట

భానుడి భగభగతో ప్రజలు అల్లాడు తున్నారు. ఉక్కపోత చికాకు పుట్టిస్తోంది. వడగల్పులు వెంటాడుతున్నాయి. ఈ వేసవి ఏప్రిల్ ప్రారంభం నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అరకొర వ్యవసాయ పనులతో పాటు ఉపాధి హామీ పథకం పనులు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజలు ఎండలకు భయపడి బయటకు రావడం కూడా తగ్గిపోయింది. ఇటు జనంతో పాటు అటు పంటలు కూడా ఎండ తాకిడికి పలు గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. మండలంలో ప్రస్తుతం 44 డిగ్రీల నుంచి 46డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. ఎండ తీవ్రతకు జనం భయపడుతున్నారు. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అడపాదడపా కురిసే వర్షాలతో వాతావరణం చల్లబడాలి కానీ ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యుడు మండుతున్నాడు. వేడి గాలుల తీవ్రత సాయంత్రం వరకు కొనసాగుతుండడంతో జనజీవనంపై ప్రభావం పడుతుంది. అసలే మండలంలో కాలువల ద్వారా పంటచేలకు సరఫరా చేసే నీరు వంతుల వారి విధానం కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండలకు వ్యవసాయ కూలీలు అల్లాడు తున్నారు. కూలీలు పొలాల్లో సొమ్మసిల్లి పడిపోతున్నారు. మండలంలో అరటి, బొప్పాయి చేలల్లో కలుపు తీతలు మహిళా కూలీలు తీస్తుండగా పురుషులు చేలపై వ్యాపించిన తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఎండలకు తట్టుకోలేక తరచు చేలగట్లపై సేదతీరుతున్నారు. దీన్నిబట్టి చూస్తే ఎండల తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుస్తోంది. మధ్యాహ్నం సమయాల్లో ఎండలకు భయపడి జనం బయటకు రాకపోవడంతో పుల్లంపేట, రెడ్డిపల్లి తదితర గ్రామాలలో రోడ్లు నిర్మాణస్యంగా ఉన్నాయి.



ఎండలకు నిర్మానుష్యంగా ఉన్న రెడ్డిపల్లి ప్రధాన రహదారి

రక్షణ చర్యలు చేపట్టాలి ఇలా..ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తెల్లని దుస్తులు, నల్లని కళ్లద్దాలు, టోపీ ధరించాలి. వృద్ధులు, చిన్నపిల్లలు ఆ సమయాల్లో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. పిల్లలు ఆడుకోవటానికి కూడా బయటకు వెళ్ళనీయవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

చల్లని పదార్థాలకు డిమాండ్..మండలంలో ఎక్కడ చూసినా వేడిగాలు వీచడంతో ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. తాటి ముంజలు, కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, కూల్ డ్రింక్స్, మజ్జిగ కోసం ప్రజలు తహత హలాడుతున్నారు. వీటికి గ్రామాల్లో కూడా డిమాండ్ పెరిగిపోయింది.

వడదెబ్బ లక్షణాలు..తీవ్రమైన తలనొప్పి, జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు కొన్ని సందర్భాల్లో వ్యక్తులు అపస్మారక స్థితిలోకి చేరుకోవడం, నీరసంతో సోమశిల్లి పడిపోవడం వడదెబ్బ తగిలిన వారికి మంచి గాలి, వెలుతురు, నీడ ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. చెల్లడి తడి వస్త్రంతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలని వైద్యులు సూచించారు. ఆర్ఎస్ ప్యాకెట్లను కలిపి స్థాపించాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేక చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం పట్టించాలని. అపస్మారకంగా ఉన్న దశలో మీరు తాగించకూడదని వైద్యులు పేర్కొన్నారు. వేసవిలో వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకుండా చూడాలని పేర్కొన్నారు. వడదెబ్బ ప్రభావం పడకుండా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి : డిఎంహెచ్‌ఒ



104 వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పీలేరు

క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య ఆరోగ్య సిబ్బంది వడదెబ్బ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం కెవిపల్లి మండలం, జిల్లెళ్ళమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారెళ్ళ గ్రామంలో నిర్వహించిన కుటుంబ వైద్య విధానంలో భాగంగా ప్రజలకు అందిస్తున్న 104 వాహన సేవలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వడదెబ్బ, ఆరోగ్య విద్య గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని ముఖ్య ప్రదేశాల్లోనూ ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం 104 వాహన సేవలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. గ్రామంలో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని తనిఖీ చేసి, అర్హులైన గర్భిణులు, చిన్నారులందరికీ నూరు శాతం టీకాలు అందజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న రోగి ఇంటిని సందర్శించి రోగి స్థితిని పరిశీలించారు. కార్య క్రమంలో వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యాలయ సిబ్బంది బలరామరాజు, లక్ష్మీ నారాయణ, ఆరోగ్య కార్యకర్త శ్రీలత, ఆశ కార్యకర్తలు రత్న, రాధ పాల్గొన్నారు.

14న బలిజల ఆత్మీయ సమావేశం

- కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయకుమార్

ప్రజాశక్తి-మదనపల్లి

ఈ నెల 14న బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని కాపునాడు రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఆంజనేయ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ 14న ఆదివారం ఉదయం 10 గంటలకు మదనపల్లె టౌన్, మిషన్ కాంపౌండ్‌లో వున్న సిఎస్ఐ జెసిఎం కమ్యూనిటీ హాల్‌లో జలిజ కులస్తుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని పేర్కొ న్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు వంగవీటి రాధ, మదనపల్లె టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి యం.షాజహాన్‌బాషా, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులుశ్రీరామ రామాంజునేయులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి టిడిపి, జనసేన, ఎన్‌డిఎ కూటమి నాయకులు, జిల్లాలోని బలిజ కులస్తులు హజరై ఆత్మీయ సమావేశంలో పాల్గొనాలని తమ అభిప్రాయలు, సలహాలు అందించాలని కోరారు. ఆత్మీయ సమావేశంలో ఆత్మగౌరవం, బలిజల ప్రాముఖ్యతపై చర్చింకుందామని కోరారు.



మాట్లాడుతున్న ఆంజనేయకుమార్

అక్రమ మద్యం కేసులో మహిళకు ఏడాది జైలుశిక్ష

- రూ.2 లక్షల జరిమానా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఎస్ఇబి పోలీసులు అక్రమ మద్యం విక్రయిస్తున్న తాడి పెంచలమ్మపై కేసు నమోదు చేసి రైల్వే కోడూరు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి అంజని ప్రియదర్శిని ముద్దాయికి ఒక సంవత్సరం పాటు జైలుశిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



నాటుసారా నిందితులను చూపుతున్న సిఐ

నాటుసారా విక్రయాలు నేరం

వంద లీటర్లు స్వాధీనం :సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం చట్టరీత్యా నేర మని వాల్మీకిపురం సిఐ పులిశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రగుంట్లబావి రోడ్డులోని కోళ్లఫారం వద్ద మేకలవారిపల్లికి చెందిన నాగరాజ గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తరలిస్తున్నాడని తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించి, నాగరాజ వద్ద ఉన్న వంద లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం నేరమని, ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. నాటుసారా విక్రయాలు, తయారీ చేస్తే సస్పెక్ట్ షీటు తెరుస్తామని హెచ్చరించారు. అక్రమార్కులు తయారీ, విక్రయాలు మానేసి కూలీ పనులు, ఉపాధి హామీ పనులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు బుధవారం ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని పిఎన్ తండాకు చెందిన గోవింద్ మద్యం తరలిస్తుండగా సమాచారం అందుకొని తమ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 336 పాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు



మాట్లాడుతున్న మురళీమోహన్ యాదవ్

షర్మిల నమ్మకాన్ని వమ్ము చేయను

పుంగనూరు కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్ యాదవ్

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతి బల్లసముద్రం గ్రామంలో పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్ యాదవ్ బుధవారం స్వగ్రామ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు వైఎస్ షర్మిల తనపై నమ్మకంతో పుంగనూరు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులుగా పోటీ చేసేందుకు అవకాశం కల్పింఆచరని అన్నారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు. తాను గతంలో సమాజ్ వాదీ పార్టీ లో రాష్ట్రం తరపున కీలక పదవుల్లో పనిచేసి, వెనుక బడిన కులాల వారి కోసం పొరాడానని అన్నారు. ములాయం సింగ్ యాదవ్ నేతృత్వంలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి మాజీ పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి సహకారంతో పుంగనూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేయడం జరుగుతుందని అన్నారు. తాను ఓ రైతు కుటుంబం నుండి వచ్చిన వెనుక బడిన కులానికి సంబంధించిన వ్యక్తిని అని అన్నారు. సామాన్య ప్రజల కష్టం తెలిసిన వ్యక్తినని, విద్యావేత్తగా కొన్ని వేల మంది విద్యార్థులకు తక్కువ ఫీజుతో విద్యాసంస్థలు, ఇన్స్టిట్యూట్‌లు నడుపుతూ సేవ చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజల ద్వారా ప్రత్యక్షంగాను పరోక్షంగాను పన్నులు రూపంలో వసూలు చేసి ఇస్తున్నదేనని అన్నారు. నాయకులు ఎవరూ తమ జోబులో నుంచి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని అన్నారు. వేలకోట్లు తమ జోబుల్లోనే మనం కష్టపడుతున్న చెమట చుక్కలోంచి వచ్చినడబ్బేనని తెలిపారు. కనుక బిజెపి పార్టీ మతాలకు కులాలకు చిచ్చుపెట్టే పార్టీ అని కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సారి కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ పార్టీ కూటమేనని, పుంగనూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నన్ను గెలిపించి అసెంబ్లీకి పంపితే మన బుడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌కే సాధ్యం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని పీలేరు, కెవిపల్లె మండలాల వైసిపి ఎన్నికల ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుధీర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కెవిపల్లి మండలం, గర్నిమిట్ట పంచాయతీలోని బలిజపల్లె, కొండారెడ్డిగారిపల్లె, అంబేద్కర్ కాలనీ, పోతిరెడ్డిగారిపల్లె, బాటవారిపల్లె దళితవాడ, చింతమాకులపల్లె తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా సిఎం ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేసి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. మరెన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. నిరంతరం ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలందరూ అండగా నివాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షనేత చంద్రబాబు అంతా మోసం, దగాలతో కూడుకున్న వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, జడ్‌పిటిసి గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ్మ. ఎఎంసి చైర్మర్ యల్లయ్య. నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, యర్రమరెడ్డి, రామకొండారెడ్డి, వేణుగోపాల్, నాగ, గౌస్, హరిబాబు, మల్లికార్జున, రమేష్ రెడ్డి, ద్వారకనాథరెడ్డి, జయరామచంద్రయ్య, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో సుధీర్‌కుమార్‌రెడ్డి

నిర్భయంగా ఓటు వేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-చిట్వేలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజలు నిర్భయంగా ఓటు వేయ డానికి అన్ని రకాల చర్యలు తీసుకున్న మని జిల్లా కలెక్టర్ అభిషేక్తి కిషోర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సి.కందుల వారిపల్లి పంచా యతీ మిట్టపల్లి దళితవాడలో ఓటర్లకు అవగా హన కార్య క్రమాన్ని నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ పకడ్బందీగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సరిగా వినియోగిం చుకోవడనికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసు కుంటుంది అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే జిల్లాలో కొన్ని పోలింగ్ స్టేషన్లో గుర్తించి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఒకటి రెండు గ్రామాల ప్రజలు తాము ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారని, జిల్లాలో కొన్ని గ్రామాలలో సపరేట్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారని వాటిని పరిశీలించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరిపడ ఓట్లు లేని కారణంగా కొత్త పోలింగ్ స్టేషన్‌ఏర్పాటు చేయడం జరగదని, కనీసం 1500 ఓట్లు దాటి ఉంటేనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జిల్లా మొత్తానికి1607 పోలింగ్ కేంద్రాలలో 12వేల మందితో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్‌ను ఒక పండుగల సంతోషంగా ఎటువంటి అవా ంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకు ందామని పిలుపునిచ్చారు. నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసి ప్రజాస్వామ్యం సౌధాన్ని నిర్మించుకుందామని కోరారు. అనంతరం గ్రామస్తులు చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. సి.కందులవారిపల్లి పోలింగ్ కేంద్రాన్ని సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు కార్యక్రమంలో ఎస్‌పి కృష్ణారావు, డిఎస్‌పి చైతన్య, ఆర్‌డిఒ మోహన్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి, తహశీల్దార్ జ్ఞానేశ్వరి, ఎంపిడిఒ రంగారావు, సిఐ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్ఐ సుధాకర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవండి

- రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి షేక్ అల్లాబకాష్



ప్రచారం నిర్వహిస్తున్న అల్లా బకాష్

ప్రజాశక్తి-రాయచోటి

అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని రాయచోటి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అల్లాబకాష్ పేర్కొన్నారు.బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రాయుడు కాలనీలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో గతంలో కాంగ్రెస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి అందించిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేసే అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన తొమ్మిది గ్యారెంటీల గురించి తెలిపారు. మహిళా మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి సంవత్సరం రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ. రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతు ధర, మొదటి సంవత్సరం కేంద్రం ద్వారా 30 లక్షలు రాష్ట్ర ద్వారా 2.25 లక్షలు ఉద్యోగాలు, పది సంవత్సరాలు గ్యారెంటీ ప్రత్యేక హోదా కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ కూలికి రోజుకు కనీసం రూ.400 వేతనం, ఇల్లు లేని వారికి ఐదు లక్షలతో ఇళ్ళు, వృద్ధులకు, వితంతువులకు రూ.4వేలు, విభిన్న ప్రతిభా వంతులకు రూ.6వేలు పింఛన్‌ను కాంగ్రెస్ పార్టీ అందస్తుందన్నారు. కెజి టు పిజి వరకు ఉచిత విద్య కల్పిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : జెసి

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరిం చాలని జాయింట్ కలెక్టర్, పీలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ నియో జకవర్గంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం స్థానిక తహశీల్దారు కార్యా లయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.ఎన్నికల నియమావళి అమలు లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో 5 కేసులు నమోదు చేసి రూ.23.79లక్షల నగదు జప్తు చేశామన్నారు. ఎన్నికల నియామవళి అతిక్రమించిన ఆరుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, 8 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామని చెప్పారు. నియోజ కవర్గంలో ఇప్పటి వరకు 122 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామాలు చేశారని తెలిపారు రాజకీ య పార్టీల ప్రచార సభలు, వాహనాలకు 163 అనుమతులు మంజూరు చేశామన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఎనిమిది ఫిర్యాదులను గంట లోపు వ్యవ ధిలోనే పరిష్కరించామని పేర్కొన్నారు.ఇంటింటి ప్రచా రానికి, కరపత్రాలు పంచడానికి రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు. అందరూ విధిగా పాటిం చాలని సూచించారు. అలా పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారిని రమా, తహశీల్దార్లు మహబూబ్‌బాషా, ఖతీజున్ ఖుబ్రా, ప్రదీప్, డిటిలు సుబ్రహ్మణ్యం, విజయ్, ఆర్ఐ చాణక్య పాల్గొన్నారు.



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న జయచంద్రారెడ్డి

ఆదరించండి..అభివృద్ధి చేస్తా :'దాసిరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తంబళ్లపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దాసిరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మద్దయ్యగారి పల్లి గ్రామ శివారులలో జనసేన తంబళ్లపల్లి ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని అన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, చదువుకున్న పిల్లలకు ఇంటిలోఎంత మంది ఉంటే అంత మందికి సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున అందిస్తారని అన్నారు. రైతులకు ఏటా రూ.20 వేలు, నిరుద్యోగ భృతి కింద యువతకు నెలకు రూ.3వేలు, వృద్ధులకు నెలకు రూ.4వేలు పింఛన్‌ను చంద్రబాబు అందిస్తారని అన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దేవుళచెరువులో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని వీపురికోట, దేవలచెరువు, పర్తికోట గ్రామాల్లో ఎస్ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామా లలో రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్, నిష్ప క్షపాతంగా, శాంతియుతంగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

38 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో 38 మంది గ్రామ వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కృష్ణమూర్తికి అందించారు. బాలిరెడ్డిగారిపల్లి 7 కోసువారిపల్లి18, కోటకొండ1, గోపి దిన్నె 2, తంబళ్లపల్లి 7,కుక్కరాజుపల్లి 2, కన్నెమడుగు ఒకరు రాజీనా మాలు చేశారు.ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పుడు నుండి ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, కులమతాలకతీతంగా ఎక్కడ రాజకీయం అనే మాట చెయ్యకుండా పేదలకు తమ వంతు సేవలు అందించామని పేర్కొన్నారు. టిడిపి నాయకులు గ్రామ వాలంటీర్లను పింఛన్ల పంపిణీలో తప్పించాలనడం బాధా కర మన్నారు. తిరిగి వైసిపి విజయానికి, స్థానిక ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిల విజయానికి కృషి చేస్తామన్నారు.



ఎంపిడిఒకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వాలంటీర్లు



క్రికెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థితో కళాశాల అధ్యాపకులు

క్రికెట్ లీగ్ మ్యాచ్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి - వేంపల్లె

హైదరాబాద్‌లో జరిగే క్రికెట్ లీగ్ మ్యాచ్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అహమ్మద్ కీజర్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. బుధవారం క్రికెట్ మ్యాచ్‌కు ఎంపికైన విద్యార్థి అహమ్మద్ కీజర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అహమ్మద్ కీజర్ మైడెన్ జట్టులో రైట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికైనట్లు చెప్పారు. మే నెలలో జరిగే హైదరాబాద్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారన్నారు. తమ కళాశాల విద్యార్థి క్రికెట్‌లో రాణించడం హర్షనీయమన్నారు. విద్యార్థిని అభినందించిన వారిలో వ్యాయామ విభాగాధిపతి బాలకొండ గంగాధర్, పీడీ తేజేంద్ర, లైబ్రరీ విభాగాధిపతి మాధవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కష్ణ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వైసిపి నేతలు

ఘనంగా దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి నేత దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతంలో వైసిపి నాయకుడు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్ మాంగే) ఆధ్వర్యంలో పార్టీ అభిమానులు భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరినొకరు కేక్ తినుపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు దంతలూరు కృష్ణ పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాయం అడిగిన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసే ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎంపిటిసి భారతి, వార్డు సభ్యుడు ముత్యాల ఆంజ నేయులు, వైఇ నాయకులు రామశేఖర్‌రెడ్డి, రాజ గోపాల్‌రెడ్డి, అశోక్, లోకేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని కచేరి రోడ్డులో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో వైసిపి నాయకులు దంతులూరు కృష్ణ జన్మదిన వేడుకలను అభిమానుల ఆధ్వ ర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆశ్రమంలోని అంధులు, వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లను చిక్కని హరికుమార్, పఠాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, బాబా అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గాన్ని అన్ని రకాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని టిడిపి కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నాగులకట్ట వీధిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గత ఐదేళ్లలో నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. కుంటుపడిన అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించాలంటే ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. దేవగుడి కుటుంబం నియోజకవర్గానికి అండగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు నాగులకట్టకు చెందిన కొన్ని కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ బాలపుల్లారెడ్డి, తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వామ్మో.. ముక్క ముట్టలేం..!

అమాంతం పెరిగిన ధరలు - తినలేమంటున్న సామాన్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాంసం ధరలు దడ పుట్టిస్తున్నాయి. మార్కెట్‌లో మాంసం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.280 పైనే పలుకుతోంది. నాటుకోడి కిలో ధర రూ.700, మాంసం కిలో ధర రూ.800. సామాన్యులు ముక్క ముట్టుకోవాలంటే భయపడిపోతున్నారు. పండుగలు, పబ్బాలు, ఆదివారాలు.. ఇలా ముక్కలేనిదే పూట తినని వారు ఎందరో, మాంస ప్రియులు ఇష్టంగా కోడికూర తింటుంటారు. కానీ ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో చికెన్ ధరలు కూడా మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్యులు ముక్క ముట్టు కోవాలంటే భయపడిపోతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చికెన్ ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.300కు చేరింది. గత నెలలో రూ.200గా ఉన్న చికెన్ ధర ఇప్పుడు ఏకంగా రూ.80 పెరిగింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న జనానికి చికెన్ ధరల పెరుగుదల గుదిబండలా మారింది. చికెన్ ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. బర్డ్ ఫ్లూ వల్ల కోళ్లు భారీగా చనిపోయాయి. ఉగాది, రంజాన్ పండుగలు కూడా ధరలు పెరగడనికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎండల ధాటికి కోళ్లు భారీగా చని



విక్రయానికి సిద్ధంగా ఉన్న కోడి మాంసం

పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎండాకాలం కోళ్ల ఉత్పత్తి, డిమాం డ్ అనూహ్యంగా పెరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం.. దాణా ధరలు పెరగడం.. ఇతర ఖర్చుల కారణంగా చికెన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వర్షం జాడ లేకపోవడం, ఉష్ణోగ్రతలు భారీగా నమోద వుతూండడంతో వర్షాకాలం ఊపందుకునే వరకు చికెన్ ధరలు ఇలాగే వుంటాయని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. ఎండ లకు కోళ్లు చనిపోతున్న నేపథ్యంలోనే రేట్లు పెరిగినట్లు తెలు స్తోంది. మాంసం ప్రియులు, సామాన్య ప్రజలు కూరగాయల భోజనం చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు.

అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తగదు



మాట్లాడుతున్న మహమ్మద్ షబ్బీర్

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీలకు చెందిన 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తారనే అవాస్తవాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం వైసిపికి తగదని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వైసిపి నాయకులు ఎన్‌డిఎ కూటమి పేరుతో ఫేక్ వార్తలను విడు దల చేయడం శోచనీయమన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజలు టిడి పికి మద్దతు ఇస్తున్న కారణంగా మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తు న్నట్లు బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పినట్లు అవాస్తవాలను మైనార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందాలని వైసిపి చూస్తోం దన్నారు. ముస్లిం మైనార్టీల ఓట్లు దండుకోవడానికి ఇలాంటి నీచమైన అవాస్తవాలను వాస్తవాలుగా చేయాలని అనుకోవడం దుర్మార్గమన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేదని, ఏనాడు కూడా ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేయలేదని తెలిపారు. ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు టిడిపి ప్రభుత్వంలో మైనారిటీలకు అమలు చేసినట్లు చెప్పారు. టిడిపి పాలనలో షాదీఖానాలు, హాజ్‌హౌస్‌లు నిర్మాణం చేపట్టడంతోపాటు మౌజన్, ఇమాంలకు జీతాలు ఇచ్చిందని తెలిపారు. అలాగే దుల్హన్ పథకం కింద నూతన జంటకు రూ.50 వేలు ఆర్థిక సహాయం చేసిందని చెప్పారు. ప్రతి ఎడాది రంజాన్ తోఫా, సంక్రాంతి కానుకలు, మసీదులకు మరమ్మతులకు నిధులు, శ్మశానాలకు ప్రహరీలు, విదేశీ విద్య నిమిత్తం నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ15 లక్షల సబ్సిడీతో వ్యక్తిగత రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉర్దూను కొన్ని జిల్లాల్లో రెండవ భాషగా అమలు చేసిందన్నారు. ఇంకోసారి మైనార్టీలకు చెందిన ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసి వైసిపికి ఉన్న కొద్ది పరువు కూడా పోగొట్టుకోవద్దని ఆయన హితవు పలికారు. సమా వేశంలో టిడిపి జిల్లా మైనార్టీ కార్యదర్శి పూల అల్లాబక్ష్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, మండల మైనార్టీ ఉపాధ్యక్షులు ఇలియాస్, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, మండల మైనార్టీ కార్యదర్శులు సయ్యద్ పీరా, ఫయాజ్, డాక్టర్ కరీముల్లా పాల్గొన్నారు.

కళాజాతా ద్వారా మేనిఫెస్టోపై అవగాహన

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ చేపట్టే బస్సు యాత్రను విజయ వంతం చేయాలంటూ చేపట్టిన కళాజాతా నృత్య ప్రదర్శనను పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ప్రారభించారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కళాజాత నృత్య ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. దీంతో కళాజాత వారు కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేని ఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పిం చారు. పిసిసి ఛీఫ్ షర్మిల చేపట్టే బస్సు యాత్రను విజయ వంతం చేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తులసిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్ర మంలో కాంగ్రెస్



నృత్య ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎన్.తులసిరెడ్డి

పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, ధృవకుమార్‌రెడ్డి, బాబు, అమర్, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - దువ్వూరు

వేసవి దృష్ట్యా పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌక ర్యాలు కల్పించాలని డిఇఒ అనురాధ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధ వారం డిఇఒ తనిఖీ చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగ తులకు జరుగుతున్న పరీక్షపై విద్యార్థులతో ముచ్చటించారు. వాటి అమలు తీరుపై ఉపాధ్యాయులకు ప్రశ్నించి, వారికి విధి విధానాలు సూచించారు. అక్కడ విద్యార్థులకు భోజన సదు పాయాలను పరిశీలించారు. అనం తరం పుల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్,సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ



పార్వేటలో ఉత్సాహంగా యువకులు, చిన్నారులు

వైభవంగా కుందేళ్ల పార్వేట

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాలలో బుధవారం వైభవంగా కుందేళ్ల పార్వేట నిర్వహించారు. ఇది చాలా కాలంగా వస్తున్న ఆచారం. ఉగాది పండుగ రోజు సందర్భంగా గ్రామంలోని యువకులు కొండ ప్రాంతానికి వెళ్లి కుందేళ్లను పట్టుకుంటారు. వాటిని గ్రామ పొలిమేర నుంచి గ్రామంలోని దేవాలయం వరకు మేళతాళాలతో తీసుకువచ్చి దేవాలయంలో ఉంచుతారు. మరుసటి రోజు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల విగ్రహాలతో భజన పాటలు పాడుకుంటూ గ్రామంలోని ఓ పొలం వద్దకు కుందేళ్లను కూడా తీసుకుని వస్తారు. అక్కడ కుందేళ్లను ఒక్కొకటిగా వదులుతారు. వీటిని పట్టుకోవడానికి యువకులు, చిన్నారులు పోటీ పడుతూ పరుగులు పెడతారు. ఆ కుందేళ్లను ఎవరు పట్టుకుంటారో వారే ఏడాది కుందేళ్ల మొనగాడని అంటారు. ఇదేగాక ఇక్కడికి మహిళలు కులమత బేధాలు లేకుండా పలు రకాల ఆటలు కూడా ఆడతారు.



తీవ్రంగా గాయపడిన వ్యక్తులు

కారు, బైకు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

- పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-కడప ప్రధాన రహదారిలోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద బుధవారం రాత్రి కారు బైకు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింహాద్రిపురం మండలానికి చెందిన శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి బైకుపై ముద్దనూరు వైపు నుంచి ఎర్రగుంట్లకు వెళుతున్నారు. ముద్దనూరులోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద ఎర్రగుంట్ల వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బైకును ఢీ కొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కారు అదుపు తప్పి.. మరో ఇద్దరికీ..

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి కెనాల్ డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వీరిని వెంటనే 108లో కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. కార్తికేయ అను వ్యక్తి తన తల్లితో హైదరాబాదు నుండి కడపకు వెళుతుండగా కారు అదుపు తప్పిందని అక్కడున్నవారు తెలిపారు.



జాతీయ రహదారిపై అదుపుతప్పిన కారు

కనిపించని ఫాగింగ్.. దోమలతో బేజార్

ప్రజాశక్తి - వేంపల్లె

దోమల దండయాత్ర మొదలైనా.. వాటి నిర్మూలనకు ఫాగింగ్ యంత్రాలు ఉన్నా.. వాటిని సక్రమంగా వినియోగించుకోకపోవడంతో మూలకు చేరాయి. దోమలు విజృంభించి విషజ్వరాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వేంపల్లె మండలంలోని ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేవు. ఇళ్ల నుంచి మురుగు నీరు బయటకు వచ్చి ఎక్కడికక్కడే తిష్ట వేస్తోంది. దోమల బెడద ఎక్కువై అక్కడి వారు జ్వరాలతో బాధపడుతున్నారు. పారిశుధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో తలనొప్పి, జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నా దోమల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాటి వినియోగంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలు, బుష్ కట్టర్లు, ఇన్సులేటర్లు, మిస్ట్ బైజర్లు ప్రభుత్వం అందించింది. అయితే పారిశుధ్య నిర్వహణకు నిధుల కొరత, మరమ్మతులు, వినియోగించే విధానం తెలియక పలు గ్రామాల్లో వాటిని అటకెక్కించారు. ఫాగింగ్ యంత్రాల వినియోగం పంచాయతీలకు భారంగా మారింది. యంత్రాల్లో డీజిల్, వీధుల్లో తిరిగేందుకు మరో వాహనానికి ఖర్చులు అధికంగా కావడంతో వాటిని అధికారులు వినియోగించడం లేదు. డ్రయినేజీ కాలువలు సరిగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో డ్రయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో మురుగు నీరు పేరుకుపోతోంది. దోమలు విపరీతంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రాత్రివేళల్లో ఇళ్లపై దోమలు దండయాత్ర చేస్తుండడంతో కొద్ది సేపు కూడా ఆరు బయట ఉండలేకపోతున్నాయని వాపోతున్నారు. పారిశుధ్య మెరుగునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పారిశుధ్యం సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. దోమలు నివారణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


రోడ్డుపై పడి ఉన్న చెత్త , సంచరిస్తున్న ఆవులు

మూడు నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు అందక పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు సుమారు 160 మంది విధులు నిర్వహిస్తున్నారు. గత మూడు నెలలుగా వీరికి వేత నాలు అందకపోవడంతో వీరి పరిస్థితి దుర్భరంగా ఉంది. ఏప్రిల్ మాసంలో ముఖ్య పండుగలైన ఉగాది, రంజాన్ పండుగలు పచ్చటి మెతుకులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందని వాపోయారు. సరుకులు అప్పిచ్చేవారు కూడా జీతాలు ఎప్పుడొస్తాయో ఏమె అర్థం కాకపోవడంతో వెనకాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సారి తమ పరిస్థితి ఇలాగే ఉంటోందని నెలంతా కష్టపడి వేతనాలకు దేవురించాల్సి వస్తోందని వాపోయారు. తమ పరిస్థితి అధికారులకు విన్నవిస్తే సిఎఫ్‌యంయస్‌లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నందు వల్ల ఆలస్యమవుతున్నాయని తెలిపారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు.


ఎస్ఐకు వినతిపత్రమిస్తున్న రైతు సంఘం నాయకులు

రోడ్లపై సిగ్నల్స్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - మైదుకూరు

పట్టణంలో ప్రజలను, ప్రయాణికులను కొందరు యువ కులు ద్విచక్ర వాహనాల్లో ప్రధాన రోడ్లపై అతి వేగంగా వెళుతూ భయభ్రాంతులకు గురి చేస్తు న్నారని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఆవుల వెంకట రమణ బుధవారం పట్టణ ఎస్ఐ మద్దిలేటికి వినతిపత్రమిచ్చారు. పట్టణంలో ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో యువకులు ద్విచక్ర వాహనాలతో అతి వేగంగా వెళుతూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని వివరించారు. పట్టణంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లను గుర్తించేలా వైట్ సిగ్నల్స్, రెడ్ సిగ్నల్ వేయించాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సమితి పట్టణ నాయకులు రామ్మోహన్, సుబ్రహ్మణ్యం, తూగుట్ల నరసయ్య, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పులివెందుల అభివృద్ధి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పాలనలోనే సింహభాగం అభివృద్ధి పులివెందుల నియోజకవర్గంలో జరిగిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ, పులివెందుల అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగంవేయడమే లక్ష్యమన్నారు. పులివెందుల నియోజకవర్గం తొలి నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. 17 సార్లు జరిగిన ఎన్నికల్లో 13 సార్లు కాంగ్రెస్ పార్టీ పులివెందులలో గెలిచిందని చెప్పారు. పైడిపాలెం రిజర్వాయర్, లింగాల కెనాల్, గండికోట-సిబిఆర్ ఎత్తిపోతల, జెఎన్‌టియు, ట్రిపుల్ ఐటి, పశుపరిశోధన కేంద్రం, శిల్పారామం, రింగురోడ్డు, సిమెంట్ రోడ్లు, పులివెందుల-కడప నాలుగు లైన్ల రోడ్డు ఇవన్నీ కాంగ్రెస్ పాలనలో జరిగినవే అన్నారు. వేమన యూనివర్సిటీ, కడప రిమ్స్ హాస్పిటల్, విమానాశ్రయ అభివృద్ధి, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల్లో పనులు సింహభాగం కాంగ్రెస్ పాలనలో జరిగాయని ఆయన వివరించారు. జగన్ పాలనలో పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిందన్నారు. మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. జూదం, బెట్టింగ్ విచ్చలవిడిగా సాగుతోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ మూలన పడిందని తెలిపారు. బిజెపి చేతిలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కీలు బొమ్మలుగా మారాయని విమర్శించారు. పౌరసత్వ సవరణ బిల్లుకు వైసిపి, టిడిపి మద్దతు ఇవ్వకుండా ఉండి ఉంటే అది చట్ట రూపం దాల్చేది కాదన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు. టిడిపి ప్రత్యక్షపొత్తు కాగా వైసిపిది పరోక్ష పొత్తు అన్నారు. ప్రత్యేకహోదా ఇవ్వకుండా, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేయకుండా, పోలవరం కుట్టకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. ఈనెల 12న శుక్రవారం ఉదయం 10 గంటలకు వేంపల్లి, సాయంత్రం 6 గంటలకు పులివెందులలో షర్మిల బస్సు యాత్ర ఉన్నట్లు చెప్పారు. 13న శనివారం ఉదయం 10.30 గంటలకు ఎర్రగుంట్ల, సాయంత్రం 5 గంటకు జమ్మలమడుగు, 7 గంటలకు ప్రొద్దుటూరులో షర్మిల బస్సు యాత్రలో పాల్గొంటారని చెప్పారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ధ్రువకుమార్‌రెడ్డి, ఉత్తన్న, వినయ్, బాలంసుబ్బరాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో పార్టీలు మారే స్వేచ్ఛ ఉంది

- ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రజాస్వామ్యంలో పార్టీలు మారే స్వేచ్ఛ ఉందని శాసన మండలి సభ్యులు ఆర్.రమేష్ యాదవ్ తెలిపారు. మండలంలోని పెద్దశెట్టిపల్లి గ్రామంలో వైసిపి నేతలు నేట్లపల్లి శివరామ్, నేట్లపల్లి రామాంజనేయులును ఆయన కలిశారు. ఇటీవల జరిగిన హత్యాయత్న సంఘటన గురించి శివరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. శివరామ్‌పై జరిగిన కుట్ర హేయమైన చర్యగా ఎమ్మెల్సీ అభివర్ణించారు. దీని వెనుక ఎంతటి వారున్న వదిలే ప్రసక్తి లేదని శివరామ్‌కు భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి జిల్లా స్థాయి అధికారులకు వాస్తవాలు నిగ్గుతేల్చి దోషులని పట్టుకోవాలని కోరినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. శివరామ్ సోదరులకు భరోసాగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నేట్లపల్లె సోదరులతో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే



ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో 10, 11, 12, 13, 19 కౌన్సిల్ వార్డులలో బుధవారం సాయంత్రం వైసిపి కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకూ తిరుగుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన అభివృద్ధి ,సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జగనన్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసి బాలయ్య, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీముల్లా, కౌన్సిలర్లు అలీ, ప్రశాంత్, యూసఫ్, షాహిద్, షర్ఫుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజీనామా పత్రాలను కమిషనర్‌కు అందజేస్తున్న వాలంటీర్లు

14 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీలోని 14వ వార్డుకు చెందిన 14 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను కమిషనర్ జబ్బార్ మియాకు అందజేశారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా వాలంటీర్లు పేర్కొన్నారు.


కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని మిట్టమానుపల్లెకు చెందిన టిడిపి నాయకులు అరికోటం చిన్న ఓబులేసు, అరికోటం నరసింహులు బుధవారం టిడిపి నుంచి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మూలె సుధాకర్‌రెడ్డి, నేట్లపల్లి శివరాం, రామాంజనేయులు ఆధ్వర్యంలో వారు చేరారు. చేరినవారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే వైసిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అయ్యేందుకు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గెలిచేందుకు తమ సాయిశక్తులా పని చేస్తామని వారు పేర్కొన్నారు.


పౌష్టికాహారాన్ని వడ్డిస్తున్న సంఘమిత్ర సభ్యులు

విభిన్నప్రతిభావంతులకు బిర్యానీ పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణం చిన్నన్న రూముల రోడ్డులోని భవిత విభిన్నప్రతిభావంతుల పాఠశాలలో సంఘమిత్ర సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం వారికి మాంసాహార పౌష్టికాహారాన్ని అందించారు. జిల్లాలోని భవిత పాఠశాలల్లో రంజాన్ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న సిరాజుద్దీన్‌కు పులివెందుల భవిత స్కూల్ రిసోర్స్ ఉపాధ్యాయులు ప్రకాశమ్మ, స్వాతి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యవర్గ సభ్యులు గంగయ్య, కేర్ టేకర్ అరుణ పాల్గొన్నారు.

పది మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

- 4 కోళ్లు, రూ.7,710 నగదు స్వాధీనం

ముద్దనూరు : మండలంలోని పెద్దదుద్యాల గ్రామ సమీపంలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి 4 కోళ్లు, రూ.7,710 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. అందిన సమాచారంతో సిఐ దస్తగిరి ఆదేశాల మేరకు కోడి పందెం స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారు ముద్దనూరు మండలం పెద్దదుద్యాల, తొండూరు మండలం మల్లేల గ్రామానికి చెందినవారని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభ్యర్థులు బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రాయచోటి

అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయం కోసం తప్పనిసరిగా ఖాతా ఓపెన్ చేయాలిని ఆర్‌డిఒ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఖాతా రాష్ట్రంలో ఎక్కడైనా సరే బ్యాంకులో గాని, కో-ఆపరేటివ్ బ్యాంకులో గాని లేదా పోస్ట్ ఆఫీసులోనైనా ఓపెన్ చేయాలన్నారు. నామినేషన్ వేయడానికి ముందుగానే ఖాతా ఓపెన్ చేసి ఖాతా నంబరు తదితర వివరాలను, ఖాతా స్టేట్‌మెంట్ సర్టిఫైడ్ కాపీని నామినేషన్ వేసే రోజు రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. ఖాతాను అభ్యర్థి తన పేరు మీద గానీ లేదా ఎన్నికల ఏజెంటుతో కల్పి జాయింట్ అకౌంటును గానీ ఓపెన్ చేయవచ్చున్నారు. అభ్యర్థి కుటుంబ సభ్యులు కానీ మరి ఎవరైనా కానీ ఎన్నికల ఏజంటు కాకపోతే జాయింట్ అకౌంటు ఓపెన్ చేయడానికి అర్హులు కారున్నారు. అభ్యర్థి ఎన్నికల నిమిత్తం పెట్టబోయే ఖర్చును ఈ అకౌంటు నుంచే నిర్వహించుకోవాలన్నారు. ఈ అకౌంటులో సొమ్మును జమ చేయాలన్నారు. అభ్యర్థులకు వుండే పాత అకౌంట్ల ద్వారా ఎన్నికల ఖర్చు నిర్వహించకూడదన్నారు. మొత్తం ఎన్నికల కార్యక్రమంలో అభ్యర్థి ఏ వ్యక్తికైనా గానీ లేదా ఏ సంస్థ కైన గానీ, ఒకే దఫా, లేదా పలు దఫాలుగా చెల్లించాల్సిన ఖర్చు మొత్తం పది వేల రూపాయలు మించనట్టైతే అటువంటి చిన్న చిన్న ఖర్చులను ఖాతా నుంచి నగదు రూపంలో ఉపసంహరించి చెల్లింపు చేయవచ్చున్నారు. ఖర్చు పది వేల రూపాయలు మించినట్టైతే అప్పుడు చెల్లింపు క్రాస్డ్ అకౌంట్ పెయీ చెక్ ద్వారా గానీ, డ్రాఫ్ట్ ద్వారా గానీ చెల్లించాల్సి ఉంటుందిన్నారు. అందువల్ల అభ్యర్తులు కొత్తగా ఎన్నికల వ్యయం కోసం ఖాతా ఓపెన్ చేసేటప్పుడు సదరు ఖాతాపై చెక్ బుక్‌ను తీసుకోవాలిన్నారు. చెల్లింపులు, పైన తెలిపిన ఖాతా నుంచే జరగాలిన్నారు. అభ్యర్థులు ఒక వ్యక్తి లేదా సంస్థ నుంచి ఒకే సారిగా గానీ పలు దఫాలుగా గానీ ఎన్నికల కార్య క్రమంలో స్వీకరించే మొత్తం పది వేల రూపాయలకు మించనట్టైతే అలాంటి డొనేషన్లు కానీ కాంట్రిబ్యూషన్ కానీ నగదు రూపంలో తీసుకొని ఖాతాలో జమ చేయాల్సి వుంటుందిన్నారు. రూ.పది వేలు మించేటట్టైతే వారి వద్దనుంచి క్రాస్డ్ అకౌంట్ పేయి చెక్ ద్వారా లేదా డ్రాఫ్ట్ ద్వారా లేదా అకౌంట్ ట్రాన్స్‌ఫర్, ద్వారా ఎన్నికల కోసం కొత్తగా ఓపెన్ చేసిన అకౌంట్ నందు జమ చేయాల్సి వుంటుందిన్నారు.కొత్తగా బ్యాంకులో గానీ, పోస్ట్ ఆఫీసులో గానీ ఖాతా ఓపెన్ చేయకుండా, కొత్త ఖాతా వివరాలను ఖాతా స్టేట్‌మెంట్ సర్టిఫైడ్ కాపీని రిటర్నింగ్ అధికారికి సమర్పించని అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఎన్నికల వ్యయానికి సంబంధించిన నియమాలను ఉల్లంఘించినట్లు భావిస్తామన్నారు. మిగిలిన వివరాలకు రాయచోటి ఆర్ఒ ఆఫీసులో ఎన్నికల వ్యయ విభాగం అధికారులను సంప్రదించవచ్చునుని తెలిపారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న గౌస్‌పీర్

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ లో పవిత్రమైన రంజాన్ మాసం ను పురస్కరించుకుని ఉపవాస దీక్ష పరులకు చికెన్ బిర్యాని ప్యాకెట్లు, పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు పీస్ విద్యాసంస్థల అధినేత, అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పీస్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైనార్టీ నాయకులు ఎస్.నజీర్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల అధినేతగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండడం అభినందనీయమని చెప్పారు. సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం దానధర్మాల మాసం అన్నారు. ఇటువంటి గొప్ప మాసంలో ఒక పుణ్య కార్యక్రమం చేస్తే, 70 పుణ్య ఫలాలు లభించే మాసం అన్నారు. కార్యక్రమంలో పీస్ స్కూల్ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని ట్రాన్స్‌జెండర్స్ కాలనీలో ఓటు హక్కుపై అవగాహన కల్పించామని వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్, వెలుగు సంస్థ సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికలలో ఓటు హక్కు వినియోగం గూర్చి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని దానిపై అవగాహన కల్పించడానికి ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కృష్ణకిషోర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారన్నారు. 2017లో ట్రాన్స్ జెండర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ట్రాన్స్ జెండర్స్ కూడా ముఖ్య పాత్ర వహిస్తారని తెలిపారు. మీ మీద ఉన్న సామాజిక కళంకం పోవాలంటే మన దేశంలో జరగ బోయే అసెంబ్లీ ఎన్నికలలో ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన దేశం అతి పెద్ద ప్రజాస్వామిక దేశమనీ, మీరందరు ఓటు హక్కు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇంకా అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మీ గురించి కూడా ఆలోచించే వ్యక్తిని నాయకుడుగా ఎన్నుకోవడం మీ బాధ్యత కనుక ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సంస్థ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సుజాతమ్మ, నాయక్, చెన్నమ్మ నాయక్, షకీరా, సుమ, లైల, హసీనా, సైరా, రాణి తదితర ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం : విజయజ్యోతి



ప్రచారం చేస్తున్న విజయజ్యోతి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని ఉప్పులూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయ జ్యోతి ఇంటింటి ప్రచారం చేపట్టారు. బుధవారం ఆమె ప్రచారం భాగంలో కొత్త ఉప్పులూరు రాజారెడ్డి, పాత ఉప్పలూరు రాజు ఆధ్వర్యంలో వైసిపి తెలుగుదేశం నుండి దాదాపు 30 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి విజయ జ్యోతి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి పేదలందరికీ అండ దండ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిల పగ్గాలు చెప్పడంతో ప్రజల్లో ధైర్యం వచ్చిందన్నారు. ప్రతి పేద కుటుంబానికి 5 లక్షల ఇళ్ల మంజూరు చేస్తుందని, ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. తనను గెలిపించి చూపిస్తే ప్రతి గ్రామం అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానన్నారు. పేద ప్రజలకు సేవ చేసేందుకే మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి పోటీ చేస్తున్నారని తెలిపారు. ఉప్పులూరు గ్రామంలో ఆమెకు అపూర్వ స్పందన లభించింది. ఎపి దళిత సమైక్య జిల్లా అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అన్వర్, కలసపాడు, బి.కోడూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గురప్ప, నాయకులు బండి బాలసుబ్బయ్య రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

చిన్నపిల్లలతో పనులు చేయిస్తే చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - కడప

షాపు యజమానులు చిన్నపిల్లలతో పనులు చేయించుకోవడం చట్టా రీత్యా నేరమ వుతుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయ వాదులు అన్నారు. స్వేచ్ఛ ఆపరేషన్ దశ, నిర్బంధిత కార్మికుల రక్షణ, పునరావాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌ఛార్జి టిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.కవిత ఆదేశాల మేరకు నిర్బంధిత కార్మికుల రక్షణ మరియు పునరావాసం కార్యక్రమాలకు సంబం ధించి ట్రంక్ రోడ్, మునిరాజ్ స్ట్రీట్, చెన్నూరు బస్టాండ్ సర్కిల్ లలో ఉన్న షాపులలో లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు, పోలీస్ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాపు యజమానులు చిన్నపిల్లలతో పనులు చేయిం చుకోవడం చట్టరీత్యా నేరమవుతుం దన్నారు. షాపులలో చిన్నపి ల్లలతో పనులు చేయిం చుకోరాదు, అని సూచించారు. వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని షాపులలో పని చేయించుకోవాలి, ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎమ్.శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మ నోహర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌లు జి.శ్రీనివాసరెడ్డి, కె.ముని స్వామి, దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నిర్మలాదేవి పాల్గొన్నారు.

టిడిపికి పూర్వవైభవం తీసుకొస్తా : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం తెస్తానని టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 18, 19, 20వ వార్డులో కొనసాగింపుగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వార్డులోని స్థానికులు స్వాగతం పలికారు. గడపక గడపకు వెళ్లి టిడిపి అధినేత తీసుకువచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ పండగ వాతావరణంలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. తమకు ఒక అవకాశం ఇవ్వాలని రాయచోటి ప్రజల రుణాన్ని తీర్చుకోవడంతోపాటు రాయచోటి ప్రజా, సంక్షేమాభివృద్ధికి పాటు పడతానని ప్రజలను కోరారు.



రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ట్యూటర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని బిసి హాస్టల్స్‌లో టూటర్లుగా పని చేస్తున్న వారికి సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లు ట్యూషన్ చెబుతారని తెలిపారు. నెలకు రూ.1,500 ఇస్తారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు కొంత ఉపయోగపడుతుందని తెలిపారు. ఏడాది కాలంగా ట్యూటర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే చెల్లించాలని తెలిపారు.

రేపు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆధ్యాత్మిక చింతనాపరులు మోతుకూరు పుల్లయ్య రచించిన తరునోపాయం మొదటి భాగం పుస్తకం ఆవిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు దిశ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాహితీ ప్రియులు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

షర్మిలను విమర్శించే అర్హత వైసిపి నేతలకు లేదు

ప్రజాశక్తి - కడప

వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు షర్మిలను విమర్శించే నైతిక అర్హత లేదని వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైల్లో ఉండగా నాడు జగనన్న వదిలిన బాణంగా వైయస్సార్ ఆశయాల కున్నగుణంగా వైసిపి కోసం 236 రోజులపాటు ప్రజల్లో మమేకమై 3200 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసిన ఘనత షర్మిలదన్నారు. వైసిపికి ప్రజల్లో పునాది వేసిన షర్మిలపై విమర్శలు చేయడం సమంజసం కాదని తెలిపారు. ఆడబిడ్డ ఉసురు తగిలితే రాజ్యాలు, రాజులు గల్లంతయ్యాయని పేర్కొన్నారు. పురాణాలు చెబుతున్నాయని పేర్కొన్నారు.

11వ సారి ఛాంపియన్‌గా శ్రీచైతన్య పాఠశాల

ప్రజాశక్తి-కడప అర్బన్

అమెరికా నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్-2024లో శ్రీ చైతన్య వరసగా 11వ సంవత్సరం ఛాంపియన్‌గా నిలిచింది. 28 దేశాలకు చిందిన విద్యార్థులు పాల్గొనగా కడపకు చెందిన శ్రీ చైతన్య బాలికల పాఠశాల విద్యార్థులు "స్పేస్ టాప్ ఆస్టరిక్" విభాగంలో టాప్ లో నిలిచారు. వీరిని కడప ఎ.జి.ఎం. రమణయ్య, ఆర్.ఐ.భాస్కర్, ప్రిన్సిపల్ నాగలక్ష్మి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ రాజ్ గోపాల్, డీన్ శివ ప్రసాద్, సి-ఇన్‌ఛార్జి గురు ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం, ప్రిన్సిపల్